క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు


మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించగా పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేదమే ప్రమాణంగా పాశురం

నంద్యాల(వ్యవసాయం): వేదమే ప్రమాణంగా పాశురాలలో ఆండాల్ మాత గోపికలకు వివరించిన సన్నివేశాన్ని 14వ రోజు తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు ఆదివారం భక్తులకు వివరించారు. ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సంజీవనగర్ రామాలయంలో తిరుప్పావై పాశురాలను వివరిస్తూ ఆండాల్ మాత 9వ గోపికను నిద్రనుంచి లేపే విధానం, శ్రీకృష్ణుడి గుణగణాలను మధురమైన స్వరమున కీర్తిస్తూ దేవదేవున్ని వైభవాన్ని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాథ్, సముద్రాల సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు, నరహరి నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత పాస్టరేట్-3 జట్టు

నంద్యాల(న్యూటౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం విజయవంతంగా ముగిసినట్లు పాస్టరేట్-3 సెక్రటరీ ప్రేమ్‌నాథ్, డయాసిస్ సెక్రటరీ స్టాన్లీ విలియమ్స్ తెలిపారు. క్రికెట్ విజేతలను పాస్టరేట్-3 డీనరీ చైర్మన్ నందం ఐజక్ గురువులు అభినందించారు. పాస్టర్ రవీంద్రబాబు, ఆర్గనైజర్ వినయ్‌సాగర్, ఎస్పీజీ ప్రిన్సిపాల్ దివాకర్ విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి


వెంకట క్రిష్ణయ్య (ఫైల్)

దొర్నిపాడు: మండల కేంద్రానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షుడు పగడాల వెంకటక్రిష్ణయ్య (58) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన 2007లో వైస్ ఎంపీపీగా పనిచేసి పలు అభివృద్ధి పనుల్లో పాలుపంచుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పగడాల వెంకటక్రిష్ణయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నివాళులర్పించి బాధిత కుటుంబీకులను ఓదార్చారు. అలాగే జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ మాజీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, మోహన్‌నాయుడు నివాళులర్పించారు.

బాల చిత్ర కళారత్న హవీష్


చిత్రకారుడు సాయి హవీష్‌ను సత్కరిస్తున్న దృశ్యం


హవీష్ గీసిన చిత్రం

నంద్యాల(అర్బన్): నెల్లూరులోని అమీర్ ఆర్ట్ అకాడమీ ఆదివారం నిర్వహించిన 9వ జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన పోటీల్లో నంద్యాలకు చెందిన సాయి హవీష్ 'బాల చిత్ర కళారత్న' అవార్డును అందుకున్నారు. నెల్లూరులోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన చిత్రకళా ప్రదర్శన పోటీల్లో హవీష్ గీసిన మహారాణా ప్రతాప్ చిత్రం అవార్డుకు ఎంపికైంది. నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఆర్ట్ అకాడమీకి చెందిన 8 మంది విద్యార్థులు గీసిన చిత్రాలను నెల్లూరులోని అమీర్ ఆర్ట్ అకాడమీకి పంపారు. అందులో సాయి హవీష్ గీసిన మహారాణా ప్రతాప్ చిత్రం అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు టౌన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సాయి హవీష్‌ను నిర్వాహకులు సన్మానించి గోల్డ్ మెడల్, మొమెంటో, సర్టిఫికెట్ అందజేశారు. నెల్లూరు డీఈఓ బాలాజీరావు, కళా సంఘాల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అమీద్ తదితరులు ఉన్నారు.

బాలలకు గుట్కా, ఖైనీ విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి: మండల పరిధిలోని కిరాణా, బీడీ, సిగరెట్, కూల్‌డ్రింక్ షాపులలో చిన్నపిల్లలకు, పాఠశాల విద్యార్థులకు గుట్కా, ఖైనీ, హాన్స్‌లాంటి మత్తు పదార్థాలను విక్రయిస్తే దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని చాగలమర్రి ఎస్‌ఐ రమేష్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదివారం చాగలమర్రిలోని వివిధ షాపులను తనిఖీ చేసి యజమానులకు సూచనలు చేశారు. చిన్నవయస్సు గల విద్యార్థులను మత్తు పదార్థాలకు అలవాటు చేస్తే వారి భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. హెడ్‌కానిస్టేబుల్ శంకర్, హోంగార్డు బాలు ఉన్నారు.

అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్

నంద్యాల(న్యూటౌన్): డివిజన్‌లోని ఆరు నారాయణ విద్యాసంస్థల స్పోర్ట్స్ మీట్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ సూర్యమౌళి, క్రీడా భారతి జిల్లా సెక్రటరీ నిమ్మకాయల సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. ఏజీఎం ప్రశాంత్ ప్రిన్సిపాల్ సునీత తదితరులు విజేతలకు ట్రోఫీని అందజేశారు.

ఇళ్లు ఇరుకు.. గోడౌన్ల నిండా సరుకు

- ధాన్యం నిల్వ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వరి రైతులు
- మద్దతు ధర లేకపోవడంతో నష్టాలు
- ధాన్యాన్ని తక్కువ ధరకు అడుగుతున్న వ్యాపారులు
- కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయని ప్రభుత్వం
- గత ప్రభుత్వం నిర్మించిన గోడౌన్లను అందుబాటులోకి తేకుండా నిర్వీర్యం

మండలంలో వరి కోతలు దాదాపు పూర్తయ్యాయి. దిగుబడులను విక్రయించేందుకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో వరి ధాన్యం బస్తా రూ.1500 వరకు పలికినా ప్రస్తుతం వ్యాపారులు అంతకంటే తక్కువ ధరకు అడుగుతున్నారు. ఈ స్థితిలో వరి ధాన్యాన్ని నిల్వ చేసుకోవడం రైతన్నలకు పెద్ద ఇబ్బందిగా మారింది. ఇరుకైన ఇళ్లలో వరి ధాన్యాన్ని నిల్వచేయడం అసాధ్యం కాగా, ప్రైవేటు గోడౌన్లలో నిల్వ చేసేందుకు వెళితే అవన్నీ నిండిపోయి ఉన్నాయి. మొదట వచ్చిన దిగుబడులను తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు వాటిని గోడౌన్లలో నిల్వ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రైతులకు ఇబ్బంది కలగకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన గోడౌన్లను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాకపోవడంతో వరి రైతుల కష్టాలు మరింత అధికమయ్యాయి. దీంతో చేసేది లేక రైతులు రోడ్ల పక్కనే ధాన్యం బస్తాలను ఉంచి కాస్తయినా ధర పెరిగితే విక్రయించుకుందామని ఆశగా ఎదురుచూస్తున్నారు.


చిన్నకంబలూరు వద్ద రోడ్డుపై ఓ పక్కన ఉంచిన వరిధాన్యం


బి.నాగిరెడ్డిపల్లె గోదాము బయట ధాన్యం బస్తాలతో ఉన్న ట్రాక్టర్లు

రుద్రవరం: పుడమిని నమ్ముకున్న రైతులకు పుట్టెడు కష్టాలు తప్పలేదు. ఏటా తొలకరి మొదలవ్వగానే రైతులు సేద్యానికి సన్నద్ధం అవుతారు. నాటి నుంచి రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తూనే ఉంటారు. పంటలు సాగు చేసేందుకు ఇంట్లోని బంగారాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టడం లేదా అప్పులు చేయడం ద్వారా పెట్టుబడి సొమ్ము సమకూర్చుకుంటారు. వాతావరణం అనుకూలించి వర్షాలు కురవగానే వివిధ రకాల పంటలు సాగుచేస్తారు. నాలుగైదు నెలలపాటు శ్రమించి పంట పండిస్తే కోత దశలో అల్పపీడనం, తుపాన్లు వస్తుంటే పంట దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు పడే అవస్థలు వర్ణణాతీతం. ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిలదొక్కుకొని పంట దిగుబడులు సాధిస్తే మద్దతు ధర లేక, కొనుగోలుదారులు ముందుకు రాక చివరకు మిగిలేది నష్టమే. ఇలాంటి పరిస్థితిలో ధాన్యాన్ని రోడ్లు, కళ్లాల్లోనే ఉంచుకొని ఎవరు కొనుగోలు చేస్తారా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు మండలంలోని రైతన్నలు.

రుద్రవరం మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో అధిక శాతం రైతులు, కూలీలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్ల కింద రెండు కార్లు పంటలు పండిస్తున్నారు. దీంతో మండలంలో నిరంతరం వ్యవసాయ పనులు సాగుతూనే ఉన్నాయి. వ్యవసాయానికి అనుకూలంగా దాదాపు వెయ్యి బోరు బావులు, 16 చెరువులు, 16 నీటి కుంటలతో పాటు తెలుగుగంగ ప్రధాన, ఉపప్రధాన కాల్వలు ఉన్నాయి. దీంతో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. పైర్లకు చీడపీడలు సోకితే రసాయన మందులు పిచికారీ చేసి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ఇంత శ్రమించి పైర్లు పచ్చగా కళకళలాడుతుంటే ఈసారి మంచి దిగుబడులు వస్తాయని, గిట్టుబాటు ధరలు లభిస్తే లాభాల బాట పడతామని భావించారు. అయితే పంట కోతలు మొదలయ్యే సమయంలోనే అల్పపీడనాలు, తుపాన్లు పంటలను దెబ్బతీశాయి. అయినప్పటికీ ఓర్చుకొని ఖర్చుల భారం అధికమైనప్పటికీ కోతలు కోయించి వచ్చిన దిగుబడులను రోడ్లు, కళ్లాలు, బయలు ప్రదేశాల్లో ఆరబోసి విక్రయించుకుంటున్నారు. మొక్కజొన్న, మినుముల కొనుగోళ్లు ఫర్వాలేదు అన్నచందంగా సాగాయి.

వరి కోతలు మొదలైనప్పటి నుంచి వరుసగా తుపాన్ల దెబ్బ పడింది. దీంతో వరి పైరు నేలవాలడం, వాటిని కూలీల సాయంతో కట్టలు కట్టించి సరిచేసుకోవడంతో ఖర్చులు పెరిగాయి. తర్వాత కోతలు కోయగా వచ్చిన వరి ధాన్యాన్ని ఆరబోసి విక్రయించబోతే ఆరంభంలో బస్తా వడ్లు కేవలం రూ.1400 నుంచి రూ.1500 ప్రకారం విక్రయాలు సాగాయి. తక్కువ ధర కావడంతో వ్యాపారులు వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి బయటి ప్రాంతాలకు తరలించారు. కొందరు రైతులు తక్కువ ధరకు విక్రయించలేక చుట్టు పక్కల ఉన్న ప్రైవేటు గోడౌన్లకు తరలించి అక్కడ భద్రపరచుకున్నారు. అలా అధిక శాతం గోడౌన్లు నిండిపోయాయి.


హరినగరం వద్ద నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ గోదాము

ఈ ఏడాది రైతులు సాగుచేసిన పంటలు, విస్తీర్ణం వివరాలు

పంట పేరు	ఖరీఫ్ (హెక్టార్లలో)	రబీ (హెక్టార్లలో)
వరి	4980	3620
మొక్కజొన్న	4226	2294
మినుము	1429	1924
వేరుశనగ	86	55
మిర్చి	187	67
పత్తి	220	-
బొప్పాయి	80	-
శనగ	-	620
ఇతరాలు	240	260

గోడౌన్లు నిండిపోవడంతో ధాన్యం బస్తాలను ట్రాక్టర్లలో తీసుకెళ్లిన రైతులు వాటిని అక్కడే ఉంచారు. మరికొందరు గోడౌన్లకు తరలించలేక, ఇళ్లల్లో ఖాళీ స్థలం లేక, రోడ్లపైనే బస్తాలను నెట్ కట్టి రాత్రి పగలు కాపలాగా ఉంటున్నారు. వ్యాపారులు వచ్చి కాస్తో కూస్తో ధరలు పెంచితే విక్రయించుకుందామని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆదుకోని కూటమి ప్రభుత్వం



ఈ ఏడాదంతా రైతులకు కష్టాలే. తుపాన్ల దెబ్బ తీవ్రంగా పడింది. వరిపైరు నేలవాలింది. దీంతో గింజలు రాలి దిగుబడి తగ్గింది. నేను 15 ఎకరాల్లో వరి సాగు చేశాను. వర్షాలకు పంట నేలవాలితే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందుతుందని ఆశించాను. అయితే కూటమి ప్రభుత్వం పరిహారం ఊసే ఎత్తలేదు. అంతేగాక గత ప్రభుత్వం కంటే అధికంగా రైతు భరోసా సాయం అందిస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా సాయమందించలేదు. దీంతో ఈ ఏడాది వ్యవసాయంలో భారీగా నష్టపోయాను. గత వైఎస్సార్‌సీపీ హయాంలో వర్షాలకు వరి పంట కాస్త దెబ్బతినగా అప్పట్లో రూ.30 వేల సాయం అందింది. ఇప్పుడు ఎకరాలకు ఎకరాలు వరి దెబ్బతింటే పట్టించుకునే వారే లేరు. – సుబ్బయ్య, రైతు బి.నాగిరెడ్డిపల్లె

మద్దతు ధర ఏదీ ?



నాకున్న ఐదెకరాల్లో వరి సాగు చేశాను. కష్టనష్టాలకు ఓర్చి ధాన్యం దిగుబడులను రోడ్ల మీదకు తెచుకున్నాను. విక్రయిద్దామంటే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎదురు చూశాను. ఇంతవరకు వాటి ఊసేలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంటకు తగ్గ మద్దతు ధర ముందే ప్రకటించి ఆర్‌బీకేలు, మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు చిల్లి గవ్వ సాయం అందించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అలాగే గత ప్రభుత్వం నిర్మించిన గోదాములను వినియోగంలోకి తీసుకురాకుండా గాలికి వదిలేయడంతో ధాన్యం బస్తాలు నిల్వ చేసుకునేందుకు కూడా వీల్లేకుండాపోయింది. ధాన్యాని రోడ్లపైనే ఉంచి రేయింబవళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోంది. – చింతల ఓబులేసు, రైతు, చిన్నకంబలూరు

పదోన్నతులు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల సుధాకర్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు 40 శాతం జేఎల్‌ఎస్‌గా పదోన్నతులు ఇవ్వాలన్నారు. జీఓ నంబర్ 223ను రద్దు చేయాలన్నారు. 302 జీఓ ప్రకారం ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను జూనియర్ లెక్చరర్లుగా భర్తీ చేసే అవకాశం ఉన్నప్పటికీ నిబంధనలను తొలగించారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ధరణి కుపేంద్రుడు మాట్లాడుతూ హైస్కూల్ పాఠశాలను రద్దు చేయడం వల్ల అందుబాటులో ఉన్న ఇంటర్ విద్య, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. రాబోయే విద్యాసంవత్సరం బడులు తెరిచేలోగా కొత్త టీచర్లు కొలువుదీరేలా మెగా డీఎస్సీని విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తీరనున్న నీటి సమస్య

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు పీహెచ్‌సీకి నీటి వసతి కల్పిస్తున్నారు. పీహెచ్‌సీలో సరైన వసతులు లేక ఉద్యోగులు, రోగులు ఇబ్బందులు పడేవారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు రూ.1.87 కోట్లతో పీహెచ్‌సీకి నూతన భవనం నిర్మించి అక్కడి సమస్యలను పరిష్కరించింది. అలాగే గత ప్రభుత్వ హయాంలోనే పీహెచ్‌సీలో నీటి వసతి కల్పించేందుకు నిధులు మంజూరు చేయించింది. ఆ నిధులతో ఆదివారం పీహెచ్‌సీ ప్రాంగణంలో రెండు బోర్లు వేయించారు. ఒక బోరులో మోటార్ అమర్చుతామని, మరో బోరులో చేతి పంపు ఏర్పాటు చేస్తామని పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్నాథరెడ్డి తెలిపారు. ఇకపై పీహెచ్‌సీలో నీటి సమస్య ఉండదని వెల్లడించారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు


గోదాదేవికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాసం ఆదివారం సందర్భంగా గోదాదేవి పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే నగర సంకీర్తనతో అనంతరం గోదాదేవి చరిత్రను చదివి వినిపించారు. తిరుప్పావై పాశురాలు చదువుతూ గోదాదేవికి పూజలు, పల్లకీ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే శ్రీకృష్ణపరమాత్మునికి ప్రత్యేక పూజలు చేశారు. ఉభయదారులుగా డాక్టర్ శర్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హాకీ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో ఆదివారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల హాకీ ఎంపిక పోటీలు నిర్వహించారు. పాస్టరేట్-1 గురువులు పాల్ రాజారావు, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు చాణిక్యరాజు, జాయింట్ సెక్రటరీ దివాకర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. మార్చిలోగా క్రీడా క్యాలెండర్ పూర్తి కావాలని, క్రీడాకారులకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. జిల్లా స్థాయి నుంచి 18 మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపనున్నట్లు చెప్పారు. జనవరి 17, 18, 19 తేదీల్లో మదనపల్లిలో జరిగే హాకీ పోటీల్లో బాలురు, 27, 28, 29 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగే హాకీ పోటీల్లో బాలికలు పాల్గొంటారని చెప్పారు.

తైక్వాండో ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలను న్యాయవాది తులసిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తైక్వాండో చాంపియన్‌షిప్ ఆర్గనైజర్ గౌస్‌బాషా, తులసిరెడ్డి మాట్లాడుతూ.. క్రీడల వల్ల దృఢశక్తి, ఆత్మస్థైర్యం, మేథాశక్తి పెరుగుతుందన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు జనవరి 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో కాకినాడలో జరిగే ఓపెన్ స్టేట్ మీట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని, మాస్టర్ గౌస్ తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఉమ్మడి జిల్లా నుంచి మూడు కేటగిరీల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. జిలాన్‌బాషా, వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా, మహమ్మద్‌రఫీ, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

కవులకు ప్రశంసలు

నంద్యాల(వ్యవసాయం): పలు సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తూ అనేక సదస్సుల్లో పాల్గొంటూ భాషా, సౌరభాలను భావితరాలకు అందిస్తున్న నంద్యాల జిల్లా కవులను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రశంసించారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు మంత్రి సత్యకుమార్ హాజరై మాట్లాడుతూ.. సాహితీమూర్తులు, ఉపాధ్యాయులు, భాషాభిమానులు తెలుగు సాహిత్య వికాసానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషా వికాసం వైభవమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నంద్యాల జిల్లా కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌బాషా, నీలకంఠమాచారి, నీలం వెంకటేశ్వర్లు, శేషఫణి, కొప్పుల ప్రసాద్, నరేంద్ర, లింగమయ్యను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నేతలు ముత్తోజీ వీరబ్రహ్మం, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మండలి బుద్ధ ప్రసాద్ కవులను సత్కరించారు. పట్టణ కవులు, సాహితీ వేత్తలు వారికి అభినందనలు తెలిపారు.

సీఐని సస్పెండ్ చేయాలి

నంద్యాల(అర్బన్): సీనియర్ న్యాయవాది వాల్మీకి శేషాద్రి మృతికి కారణమైన అనంతపురం త్రీటౌన్ సీఐని సస్పెండ్ చేయాలని ఎంవీఆర్‌పీఎస్ నేతలు పులికొండన్న, లాలుస్వామి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అనంతపురంకు చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రిని ఓ సివిల్ కేసు విషయంలో పలుమార్లు విచారణ నిమిత్తం సీఐ దుర్భాషలాడటంతో స్టేషన్‌లోనే న్యాయవాది చనిపోవడం జరిగిందన్నారు. న్యాయవాది మృతికి కారణమైన సీఐపై విచారణ జరిపి శేషాద్రి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నాయకులు నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

రుద్రవరం: గ్రామంలో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వరప్రసాద్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఆర్.నాగులవరంలో ఇటీవల పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి సంబంధించి 41 రోజుల చలువ పండుగ ఈ నెల 31న చేసేందుకు గ్రామ పెద్దలు తగిన ఏర్పాట్లు చేపట్టారు. ఆ విషయంపై ఆదివారం ఎస్‌ఐ గ్రామ ప్రజలకు సూచనలు చేశారు. చలువ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, రికార్డింగ్ డ్యాన్సులు, ఆర్కెస్ట్రా వంటి వాటికి అనుమతులు లేవని చెప్పారు. గ్రామస్తులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షిప్తం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాల(వ్యవసాయం): ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు అందించడంలో భాగంగా సోమవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్‌రావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సేవలపై సెల్ నంబర్ 73828 70767కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

బొమ్మలసత్రం: మైనర్లకు వాహనాలు ఇచ్చి బయటకు పంపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా హెచ్చరించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన తనిఖీల అనంతరం సీఐ మాట్లాడుతూ.. 30 మంది మైనర్లను వాహనాలు నడుపుతుండగా గుర్తించామన్నారు. మైనర్లను స్టేషన్‌కు తీసుకువెళ్లి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. రానున్న డిసెంబర్ 31న రాత్రి ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడతామన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపడతామని చెప్పారు. యువకులు అత్యుత్సాహంతో వాహనాలను వేగంగా నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. న్యూఇయర్ వేడుకలను కుటుంబ సభ్యుల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పిల్లలు రాత్రి సమయాల్లో బయటకు రాకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులదేనని స్పష్టం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మాధవీలత


మాధవీలత

నంద్యాల(న్యూటౌన్): దక్షిణాది ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నంద్యాలకు చెందిన బాలా అకాడమీ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత ఎంపికైనట్లు ఆ సంఘం నిర్వాహకులు పి.నాగయ్య ఆదివారం తెలిపారు. 2025 జనవరి 5వ తేదీన జరిగే సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా గుంటూరులో జరిగే సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డును అందించనున్నట్లు వెల్లడించారు. మాధవీలత సేవలను, అంకిత భావాన్ని గుర్తించిన ఆర్గనైజేషన్ నిర్వాహకులు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లాస్థాయి సమావేశం వేణుమాధవ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్, ఉపాధ్యక్షుడు ముక్తార్‌బాషా, రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఉత్తన్న కుమార్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనకు సంబంధించి రూ.2900 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో కళాశాలల యాజమాన్యం విద్యార్థులను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఏపీ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అలాగే ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. జేఏసీ నాయకులు శ్రీరాం, మోహన్, శ్రీహరి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం


బాధిత కుటుంబసభ్యులకు నగదును అందజేస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన దేవనగర్ శివాలయ పూజారి నాగరాజుశర్మ కుమార్తె నందిని మెదడుకు సంబంధించిన వ్యాధి బారిన పడటంతో పలు స్వచ్ఛంద సంస్థలు, కులసంఘాలు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు ఆపన్నహస్తం అందించారు. ఆమె చికిత్సకు రూ.10 లక్షలు ఖర్చవుతుందని శాంతిరాం ఆసుపత్రి వైద్యులు చెప్పారు. ఈ విషయం ఆత్మీయత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలైన స్వాతికి తెలియజేయడంతో పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా సేకరించిన రూ.1.01 లక్షలు నగదును ఆదివారం బాలిక తల్లిదండ్రులకు అందించారు. అలాగే నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు, రామకృష్ణ విద్యాలయం 1998 పూర్వ విద్యార్థులు రూ.12 వేలు, బలిజ సంఘం నాయకులు రూ.6 వేలు, విదేశాల్లో స్థిరపడిన నంద్యాల వాసులు, వ్యాపారస్తులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు స్పందించడంతో ఆదివారానికి దాదాపుగా రూ.3 లక్షలకు పైగానే వారి ఖాతాలో జమ అయినట్లు వెల్లడించారు.

ప్రతిభకు పట్టాభిషేకం


విద్యార్థుల తల్లిదండ్రులకు నగదును, ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): 2023–24 సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నగదు బహుమతులతో సత్కరించారు. స్థానిక నందమూరినగర్‌లోని గోపిశెట్టి పద్మావతి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్‌జీఎం విద్యాసంస్థల అధినేత శాంతిరాముడు, సౌత్ ఇండియా కాపు సంఘం నాయకుడు దాసరి రాము, ప్రముఖ న్యాయవాది రామచంద్రారావు హాజరయ్యారు. వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నారాయణరావు, ఫణీంద్ర మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియెట్, నీట్, నీట్ పీజీ, ఐఐటీ, స్పోర్ట్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన 200 మంది కాపు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందించినట్లు చెప్పారు. అనంతరం కాపు టీచర్లను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కాపు నాయకులు శ్రీనివాసరావు, యామప్రసాద్, చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

నంద్యాల(అర్బన్): పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం పట్టణంలోని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి, కార్యదర్శి చాంద్‌బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కృష్ణారావు, గోపాల్‌రెడ్డి, విజయరావు, జగదీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మిల్లీ కౌన్సిల్ సేవలు విస్తరిస్తాం


నియామక పత్రాలు చూపుతున్న సభ్యులు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో మిల్లీ కౌన్సిల్ సేవలు విస్తరించనున్నట్లు ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు ముఫ్తీ ఖదీర్ మౌలానా సోయాబీ నిజామీ పేర్కొన్నారు. పట్టణంలోని రసూల్ మసీదులో ఆదివారం ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాభివృద్ధి కోసం మిల్లీ కౌన్సిల్ పాటు పడుతుందని,మున్సిపల్ మైనార్టీలకు ఉచిత విద్య, వైద్యం, స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామన్నారు. సమావేశంలోని పేదలకు ఉచితంగా భోజనం పెట్టడం ఇస్లాం అభిమతమని, ఆ విధంగా కౌన్సిల్ సేవలను విస్తరించనున్నామన్నారు. మిల్లీ కౌన్సిల్ నంద్యాల జిల్లా కార్యదర్శిగా ఫయాజ్, సహాయ కార్యదర్శిగా కౌన్సిలర్ తబ్రేజ్‌లను నియమించారు. హాజీ సలాం, మజీద్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువ ఉత్సవ్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఆదివారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ యువ ఉత్సవ్–2024 ఘనంగా నిర్వహించారు. ఎంపీ బైరెడ్డి శబరి, ఎంసీహెచ్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ రాహుల్ గిరిరెడ్డి, పార్థసారథి రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంపీ శబరి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అనంతరం థీమ్ ఆఫ్ ద పంచ్ ప్రాన్ ఆఫ్ అమృత్ కాల్గోల్ ఆఫ్ డెవలప్ టు ఇండియాపై నిర్వహించిన పోటీ కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే వ్యక్తిగత సైన్స్ మేళా, యువ కళాకారులకు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.